## క్లుప్తంగా

### ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నసీమా షేక్



నర్సాపూర్: పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ పాఠశాల, కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నసీమా షేక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కొనసాగిన సంగమేశ్వర్ అంబర్‌పేట పాఠశాలకు బదిలీపై వెళ్లడంతో ఆయన నుంచి నసీమా షేక్ బాధ్యతలు తీసుకున్నారు.

### లయన్స్ 320 డీ క్లబ్‌ల కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి



నియామక పత్రం అందజేస్తున్న క్లబ్ గవర్నర్

రామాయంపేట(మెదక్): పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందుకు లయన్స్ సభ్యుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి 320 డీ క్లబ్‌ల జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని లయన్స్ భవనంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో క్లబ్ గవర్నర్ నగేశ్ నియామకపత్రం అందజేశారు. 320 డీ పరిధిలో 140 క్లబ్‌లున్నాయి. తనపై నమ్మకంతో కేటాయించిన పదవికి న్యాయం చేస్తానని రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు క్లబ్‌లకు చెందిన క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు



మంత్రి దామోదరను సన్మానిస్తున్న నాగరాజు

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో మండలంలోని కాళ్లకల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు యేశం నాగరాజు యాదవ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా మంత్రి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు మహేశ్

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన వైద్యుడు మహేశ్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరేందర్, దశరథ్, పాపయ్యచారి, తదితరులు ఉన్నారు.

### చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



హారతి ఇస్తున్న అర్చకుడు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారితో పాటు ఆలయంలోని బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లను దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

### కౌడిపల్లిలో పసక పండుగ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో క్రిస్టియన్లు ఆదివారం పసక పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని పంటల పొలాలవద్ద స్థానిక సీఎస్ఐ చర్చి పాస్టర్ జైపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పంటలు బాగాపండి ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్థన చేసినట్లు చెప్పారు. అనంతరం పంట పొలాలవద్ద వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# కోతులతో జనం బెంబేలు

- కిష్కింద కాండను తలపిస్తున్న వానరాలు
- ఇళ్లలోకి చొరబడి విధ్వంసం



కోతులు ఇళ్లపై నుంచి పెంకులను తొలగించటంతో కప్పిన టాపర్లు



ఫణిరాజ్ (ఫైల్)

మెదక్‌జోన్: చేతికి పట్టి ఒళ్లంతా గాయాలతో ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తిపేరు ఫణిరాజ్. ఈయనది హవేళిఘనాపూర్ మండల కేంద్రం. మూడు నెలల క్రితం ఉదయం 7 గంటల సమయంలో తలుపులు తెరవగానే ఒక్కసారిగా కోతుల గుంపు అతనిపై దాడిచేసి విచక్షణా రహితంగా కరిచాయి. దీంతో గల్లీలో వాళ్లు గమనించి వాటిని తరిమారు. తీవ్రంగా గాయపడిన ఫణిరాజ్ మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో 20 రోజుల పాటు చికిత్స పొందాడు. అతనికి చికిత్స కోసం రూ. 35 వేల ఖర్చు వచ్చింది. ఈ ఫణిలాంటి బాధితులు కోకొళ్లలుగా ఉన్నారు.

మెదక్ జిల్లాలో ఊరు వాడా, పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వందలాదిగా కోతులు గుంపులు, గుంపులుగా ఇళ్లలో చొరబడుతున్నాయి. ఆహారంతో పాటు చేతికి దొరికిన ప్రతీ వస్తువును ఎత్తుకెళ్తున్నాయి. మనుషులపై దాడిచేసి కరుస్తున్నాయి. చేతుల్లో బ్యాంగులు, కవర్లు కనిపిస్తే చాలు వెంటపడి లాకెళ్తున్నాయి. పెంకుటిళ్లపై ఉన్న పెంకులను తొలగిస్తూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. దీంతో వానాకాలం వర్షాలు కురిస్తే ఇళ్లు ఉరుస్తున్నాయి. ప్రతీ ఏటా రూ. 5 వేల నుంచి నుంచి రూ. 10 వేల వరకు వెచ్చించి కవర్లను ఇళ్లపై కప్పుతున్నారు. ఇది ఏటా జరుగుతున్న పెంకుటిళ్ల పరిస్థితి. ఫలితంగా ప్రజలు అప్పుల పాలవుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారు.

#### పంటలు పండించలేని పరిస్థితి

వరితో పాటు ఏ పంట సాగు చేసినా.. కోతులు వాటిని ధ్వంసం చేస్తున్నాయి. దీంతో అన్నదాతలు వాటి నుంచి పంటల రక్షణ కోసం చేయని ప్రయత్నం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా పంటలను నాశనం చేస్తున్నాయి. కోతుల బారీ నుంచి రక్షించాలని రైతులు కోరుతున్నారు.

#### కాపాడేదెవరు..?

ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కోతుల బారీ నుంచి కాపాడేదెవరని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటిని అరికట్టేందుకు ఏ మార్గం లేదా అని ఆవేదన చెందుతున్నారు. అడవుల్లో ఉండాల్సిన కోతులు ఊళ్ల మీదకు వచ్చి విధ్వంసం సృష్టిస్తూ మనుషులపై దాడులు చేసి కరిచి పెడుతున్నా, అటవీశాఖ అధికారులు, పాలకులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### ఇంటికి రెండువందలు వసూళ్లు..

హవేళిఘనాపూర్ మండలం సర్దన గ్రామంలో కోతుల బాధ భరించలేక గతంలో ఇంటింటికి రూ. 200 చొప్పున వసూళ్లు చేసి రూ. 2 లక్షలతో కోతులను పట్టే వారికి ఇచ్చి కోతులను పట్టుకెళ్లాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో రెండు డీసీఎంల కోతులను పట్టుకెళ్లి అడవుల్లో వదిలారు. కొన్ని నెలల పాటు ఆ గ్రామంలో కోతుల బారీ నుంచి ఊరిని కాపాడుకున్నారు. మళ్లీ యథావిధిగా వచ్చాయి.



జంగరాయిలో ఓ ఇంటిపై ఉన్న కోతుల సైనం

#### అడవికోతి కరిస్తేనే పరిహారం...!

కోతులు రెండు రకాలుగా ఉంటాయని, అడవి కోతి కరిస్తేనే పరిహారం ఇస్తామని, ఊర్లలో ఉండే కోతులు కరిస్తే పరిహారం ఇవ్వటం కుదరదని ఫారెస్ట్ వైల్డ్ లైఫ్ అధికారులు చెబుతున్నారు. ఇటీవల వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ఉన్నతాధికారి చెప్పారు.

## రైతులను ఒప్పించి భూములు సేకరించాలి

నర్సాపూర్: రైతులను ఒప్పించిన తర్వాతనే భూములు సేకరించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. సంగారెడ్డి రీచ్- 2 కాల్వ వద్దు అర్బన్ ఏరియా ముద్దు, కాల్వకు భూములు ఇవ్వమన్న డిమాండ్‌తో నర్సాపూర్‌లో ఆయా గ్రామాల రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం నాటికి మూడో రోజుకు చేరాయి. కాగా దీక్షలకు నాగరాజు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కాల్వలకు, ట్రిబుల్ ఆర్ రోడ్డుకు భూముల సేకరణ కోసం గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతుల అంగీకారం అనంతరం సర్వే పనులు చేపట్టాలనఅనరు. రైతులు ఇవ్వమంటే ఒత్తిడి చేయొద్దని అన్నారు. రైతుల డిమాండ్ మేరకు భూమికి భూమి ఇవ్వాలని, లేని పక్షంలో ఎకరానికి రూ.60 నుంచి రూ.70లక్షల ధర చెల్లించాలని తెలిపారు. రిలే నిరాహార దీక్షల్లో చిన్నచింతకుంటకు చెందిన మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సంధ్యాతండా, చిప్పల్‌తుర్తి గ్రామాల రైతులు జయరాంనాయక్, శ్రీనివాస్‌నాయక్, తరుణ్, రవి, రాజు, విఠల్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాల్వ వద్దు, భూములు ముద్దు లాంటి నినాదాలు చేశారు.



నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్షల్లో సీపీఎం నాయకులు, రైతులు

## అధ్వానంగా అంబాజీతండా రోడ్డు



అంబాజీతండా రోడ్డు దుస్థితి

కౌడిపల్లి(నర్సాపూర్): అంబాజీతండా రోడ్డు అధ్వానంగా మారింది. చిరు జల్లులతోనే చిత్తడి అయింది. దీంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో కంచన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంబాజీతండాకు ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటర్ దూరం ఉంది. ఇందులో కొంచెం కంకరరోడ్డు, కొంచెం మట్టిరోడ్డు ఉంది. రోడ్డుపై గుంతలు పడటంతో చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారింది. దీంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ కింద తండాలోని అంతర్గత రోడ్లు సీసీ రోడ్డు వేయగా, తండాకు వెళ్లేదారి మాత్రం వేయలేదు. దీంతో సమస్య తీరలేదు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి, బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని తండావాసులు కోరుతున్నారు.

# రైతులను ఆదుకోవాలి

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): ప్రాజెక్టులను నింపి రైతులు కరువు బారిన పడకుండా కాపాడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సురక్షతమైన నీటిని తాగాలన్నారు. తాగునీరు కలుషితమైతే అనేక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మాయ మాటలుచెప్పి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు రూ.4 వేల పెన్షన్ వెంటనే అందించాలని కోరారు. కేసీఆర్ మీద కక్ష కట్టి కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. తాను ఎమ్మెల్యే ఎన్నికయ్యాక మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి చెరువులు, కుంటలు, కూడవెళ్లి వాగులోకి నీటిని వదలాలని కోరామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రాంగాల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులకు వాటర్ క్యాన్లు, తడిపొడి చెత్త బుట్టలు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల పిడుగుపడి మరణించిన కదారి శ్రీశైలం కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి, మాజీ ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ బక్క కనకయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహులు, అశోక్, నరేందర్‌గౌడ్, రాములు, కొండల్‌రెడ్డి, రాజిరెడ్డి, పులీంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



జప్తిలింగారెడ్డిపల్లిలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

## సచివాలయ ముట్టడికి తరలిరండి

చిన్నశంకరంపేట(మెదక్): నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు సోమవారం చేపట్టే రాష్ట్ర సచివాలయ ముట్టడికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని మండల బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి అత్తెల్లి నాగరాజు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 10 నిరుద్యోగ డిమాండ్ల సాధనకు అందరు కలిసిరావాలని కోరారు. బీసీ ఉద్యమ నాయకుడు ఆర్. కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధ్వర్యంలో జరిగి ఆందోళనకు మద్దతుగా నిలవాలని కోరారు.

#### తరచూ విద్యుత్ అంతరాయం

నర్సాపూర్: ఆదివారం నర్సాపూర్ పట్టణంలో కరెంటు సరఫరాలో అంతరాయం కలగడంతో విని యోగదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం సుమారు మూడు గంటల నుంచి రాత్రి వరకు అనేక సార్లు కరెంటు సరఫరా నిలిచిపోవడం, కొంత సేపటికి మళ్లీ వచ్చింది. కరెంటుపై ఆధారపడే వ్యాపార సంస్థల నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై మండల ఏఈ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా సబ్‌స్టేషన్‌లో ట్రిప్ కావడంతో అంతరాయం ఏర్పడిందని తెలిపారు.

## • వైభవంగా బోనాలు



నర్సాపూర్ రూరల్: బోనాల ఊరేగింపు



కొల్చారం: బోనాలతో మహిళలు

కొల్చారం(నర్సాపూర్): ఆషాఢం బోనాల ఉత్సవాలతో గ్రామాల్లో సందడి నెలకొంది. మండలంలోని కొంగోడులో ఆదివారం గంగమ్మ తల్లికి బోనాల ఉత్సవాలను నిర్వహించారు.

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణం రాయరావు చెరువు కట్టపై వెలిసిన ఎల్లమ్మదేవికి ఆదివారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ కుమ్మరి సురేష్, కౌన్సిలర్ లక్ష్మి, కష్ణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

#### నల్లపోచమ్మ ఆలయంలో బోనాలు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో ఆదివారం నల్లపోచమ్మ ఆలయంలో ఆషాడ బోనాల ఉత్సవాలు నిర్వహించారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేట(మెదక్): ప్రగతి ధర్మారం గ్రామంలో బోనాల ఊరేగింపు

## కార్మికులకు నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): పంచాయతీ కార్మికులకు మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. 4 నెలల నుంచి వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకొని శివ్వంపేట గ్రామ పంచాయతీలోని కార్మికులందరికీ నెల రోజులకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. కొత్తపేట గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు మహేష్‌గుప్తా రూ.20 వేల నగదు నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెక్కడితే గాని డొక్కడని పేద కుటుంబాలకు చెందిన కార్మికులకు ప్రభుత్వం క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోచగౌడ్, కొండల్, రాములుగౌడ్, వెంకటేష్, లక్ష్మీనర్సయ్య, రమేష్‌గుప్తా, తదితరులు ఉన్నారు.

# ఎల్లమ్మ తల్లికి పూజలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుండి భక్తులు ఆలయానికి చేరుకొని ఎల్లమ్మ దేవికి కల్యాణం, ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చేగుంట, చిన్నశివునూర్, మక్కరాజీపేట తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**నల్లపోచమ్మదేవి ఆలయంలో..**

కౌడిపల్లి(నర్సాపూర్): భక్తులతో తునికి నల్లపోచమ్మ ఆలయం అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. ఆదివారం ఉదయం దేవాదయశాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలుతీసి మొక్కులు తీర్చుకున్నారు.

**శాకాంబరిగా రాజరాజేశ్వరి దేవి**



చేగుంట(తూప్రాన్): ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): ఆషాఢ మాసం పురస్కరించుకొని పట్టణంలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు చేశారు. ప్రత్యేకంగా తయారుచేసిన నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ దర్శనం చేసుకుంటున్న భక్తులు



శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

## సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ఫరీద్‌పూర్ పాఠశాలకు బదిలీపై వచ్చిన హెచ్ఎం శ్రీహరిని గ్రామస్తులు గ్రామ మాజీ ఎంపీటీసీ రాజయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు ఫలితాలు సాధించి మంచి ఫలితాలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హెచ్ఎం అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ బ్రహ్మం, మాజీ సర్పంచ్ బ్రహ్మం, వినోద్ తదితరులు ఉన్నారు.

◆ **పూరిగుడిసె దగ్ధం**

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని చంద్రుతండా పంచాయతీ పరిధిలోని వసురాంతండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన సోమ్లానాయక్ గుడిసెలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుడిసె దగ్ధమైంది. యువకులు మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నం ఫలితం లేకపోయింది. నిత్యావసర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

◆ **కొండపోచమ్మకు భక్తుల తాకిడి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని శ్రీ కొండపోచమ్మ ఆలయాన్ని ఆదివారం రాజ్యసభ్య సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ దర్శించారు. ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు తెలిపారు. సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, మహేందర్‌రెడ్డి, భానుప్రకాష్‌రావు, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **పూర్వ విద్యార్థుల సమ్మేళనం**



శివ్వంపేట(నర్సాపూర్): 1998- 99 దొంతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం తూప్రాన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వేడుకగా నిర్వహించారు. ఈసందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

◆ **డీఎస్పీ మహాసభను జయప్రదం చేయాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): ధర్మ సమాజ్ పార్టీ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 22వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే మొదటి ప్లీనరీ మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు మహారాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 93 శాతం ఉన్న బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ, అగ్రకుల పేదల తరపున ధర్మ సమాజ్ పార్టీ రాజకీయ యుద్ధం చేస్తోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు బీసీ, ఎస్టీ, ఎస్సీలను జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకే పరిమితం చేసి ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రిగా బీసీయేతరులే రాజ్యమేలుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దీపక్ రాజ్, మండల నాయకులు కుమార్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా బోనాల ఉత్సవాలు**

గజ్వేల్‌రూరల్: ఆషాఢ మాసంలో నిర్వహించే మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహంకాళి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని మహిళలు బోనాలతో దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు.